# మిసెస్ పరాంకుశం

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



*1971 లో మల్లాది గారి కలం నుంచీ వెలువడిన రెండవ నవల*

*(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)*

### 5

**మర్నాడు ఉదయం** తొమ్మిది గంటలకి ఆఫీసుకి వెళ్ళడానికి సిద్ధం అయి పేపర్ చూసుకుంటుండగా పరాంకుశం అక్కయ్య చెప్పింది పరాంకుశంతో.

"సౌదామినికి నాలుగు జతల బట్టలు తీసుకోవాలి. చీరలు తీసుకోమంటావా, ఒణీలా? చీరలయితే బాగుంటుంది."

"చీరలే తీసుకో, వెంటబెట్టి తీసుకెళ్ళి ఏవి బావుంటే అవి కొను."

"ఇంకా లేవలేదు.లేపనా?"

పేపరు పక్కన పెట్టి చెప్పాడు పరాంకుశం.

"లేపు. ఇలాంటి చిన్న చిన్న విషయాలు నువ్వు నన్ను అడగక్కరలేదు."

కొన్ని క్షణాలు తటపాయించి చెప్పింది.

"మన ఇల్లు, వాతావరణం అలవాటుపడే దాకా జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే సౌదామినికి కోపం వచ్చి వెళ్ళిపోతుంది. నీతో చెప్పకుండా ఏ పొరపాటైనా జరిగితే సౌదామిని వెళ్ళిపోతుంది. నీతో చెప్పి చేస్తే మంచిదని చెప్పాను. అంతే."

పరాంకుశం అక్కయ్య కళ్ళలోకి సూటిగా చూస్తూ చెప్పాడు కొంచెం బాధగా.

"అక్కయ్యా! నీ ఇష్టం, నువ్వు ఏం చేసినా, ఏం జరిగినా ఎందుకు ఇలా జరిగిందని ఎప్పుడూ అడగను. నీకు ఈ ఇంట్లో పూర్తి స్వాతంత్ర్యం ఉంది. నువ్వు ఏం చేసినా మా మంచి కోరే చేస్తావనే నమ్మకం నాకు బాగా ఉంది."

"అలాగే. ఏమనుకోకు. ఊరికినే అన్నాను."

పరాంకుశం అక్కయ్య సౌదామిని గదిలోకి వెళ్ళింది. పేపర్ మళ్ళీ అందుకున్నాడు పరాంకుశం.

పేపర్ చదువుతూ అక్కయ్య సౌదామినిని లేపటం విన్నాడు. సౌదామిని మాటలు గట్టిగా వినపడ్డాయి,

"నేను లేవనంటే లేవను. పదకొండు దాకా లేవను."

పరాంకుశం పేపర్ పక్కనపెట్టి సౌదామిని గదివైపు నడిచాడు.

"లేమ్మా! ఇంత పొద్దెక్కిన దాకా పడుకోకూడదు ఇంక."

"అవతలకి ఫో నువ్వు. ఎవరితో చెపుతావో చెప్పుకో ఫో."

పరాంకుశం గుమ్మం దగ్గరే ఆగిపోయి చూసాడు, సౌదామిని ఛెళ్ళున అక్కయ్య మొహం పగలకొట్టడం.

"అక్కయ్యా! నువ్వు బయటకు వెళ్ళు. దీని సంగతి నేను చూస్తా." చెప్పాడు పరాంకుశం గదిలోకి వెళ్ళి.

పరాంకుశం అక్కయ్య ఏమీ జరగనట్లే మామూలుగానే వెళ్ళిపోయింది బైటికి. సౌదామిని కొంచెం కంగారుపడ్డది పరాంకుశాన్ని చూసి, మంచం మీద నుంచి లేచి కూర్చుంది. పైట సర్దుకోలేదు.

"నిద్ర చాలలేదా?" అడిగాడు పరాంకుశం మృదువుగా.

సౌదామిని సమాధానం చెప్పలేదు.

"లే.. లేచి మొహం కడుక్కో" అదే స్వరంతో చెప్పాడు.

"ఇంకా సేపు పడుకుంటాను"

"నిన్ను పక్క మీంచి లాగి, నీళ్ళ గదిలోకి తొయ్యకముందే లేచిపో." చెప్పాడు పరాంకుశం, మంచం దగ్గరికి నవ్వుతూ నడిచి.

దుప్పటి ముసుగెట్టుకుంది సౌదామిని నిర్లక్ష్యంగా.

"లెమ్మంటుంటే నీక్కాదు చెప్పేది?"

వంటగదిలోని పరాంకుశం అక్కయ్య పరిగెత్తుకొచ్చింది గుమ్మం దగ్గరికి. స్ప్రింగులా లేచింది సౌదామిని భయంగా పరాంకుశం అరుపుకి.

పరాంకుశం గొంతు చించుకుని, ఇల్లు కూలిపోయేటట్లుగా అరిచాడు మళ్ళీ.

"నీళ్ళ గదిలోకి వెళ్ళు."

బిగురుసుకున్న పరాంకుశం పిడికిలి వంక, పరాంకుశం మొహంలోని కోపం చూసి సౌదామిని నీళ్ళ గదిలోకి వెంటనే వెళ్ళింది.

అయిదు నిముషాల్లో బయటకు వచ్చింది సౌదామిని. ఇంకా పరాంకుశం నీళ్ళగది బయటే నిలబడి ఆమె కోసం ఎదురు చూస్తూ కనిపించాడు.

"పద."

సౌదామిని చెయ్యి పట్టుకుని దేముడి గదిలోకి తీసుకు వెళ్ళాడు.

"దేనికి?" అడిగింది సౌదామిని.

"నాకు పూజ చేయటం రాదు, ఎప్పుడూ చెయ్యలేదు."

దణ్ణం పెట్టింది.

"చెంపలు వేసుకో."

వేసుకుంది.

"ఒకసారి కాదు, మూడుసార్లు."

"సౌదామిని మూడుసార్లు చెంపలు వేసుకో."

ఈసారి ఛెళ్ళు ఛెళ్ళుమని చెంపలు పగిలేలా వాయించుకుంది సౌదామిని.

"తృప్తా?" అడిగింది కోపంగా.

బయటకి నడిచాడు పరాంకుశం.

"కోపం పోయిందా?" అంటూ వెనకే వస్తున్న సౌదామిని వైపు తిరిగి చూడకుండా గట్టిగా చెప్పాడు పరాంకుశం.

"పావుగంట సేపు దేవుడి ముందు కూర్చో. బయటికి వచ్చావా.."

"దేనికి?"

"చెప్పినట్లు చెయ్యి. అక్కయ్యా, ఆఫీసుకు వెళుతున్నాను. సౌదామినిని పావుగంట తర్వాత పిలువు. అంతదాకా అక్కడే ఉండనీ, ఈ లోపల బయటికి వస్తే తర్వాత నాకు చెప్పు."

చెప్పులు తొడుక్కుని వీధిలోకి నడిచాడు పరాంకుశం.

ఆఫీసులో, తన సీటులోంచే పరాంకుశాన్ని శ్రీకంఠం విష్ చేసాడు.

పరాంకుశం శ్రీకంఠం సీట్ పక్కనే ఆగి అడిగాడు.

"ఇంటికి రాలేదే? ఉదయం ఆఫీస్‌కు వెళుతూ వస్తావనుకున్నాను. దారే కదా."

"ఊరికినే రాలేదు."

"రేపటినుంచి రా. ఇద్దరం కలిసే వెళదాం."

"నేను ఒక్కొక్కసారి ముందే వచ్చేస్తుంటాను. ఒక్కొక్కసారి ఆలస్యంగా వస్తుంటాను."

"ఫర్వాలేదు."

"నిజం చెప్పాలంటే నాకు రావడం ఇష్టం లేదు."

"ఎక్కడికి? మా ఇంటికా?" ఆశ్చర్యంగా అడిగాడు పరాంకుశం.

"అవును."

నమ్మలేనట్లుగా చూసాడు శ్రీకంఠం కళ్ళలోకి పరాంకుశం.

"నీకు మాఇంటికి రావడం ఇష్టంలేదా?" అడిగాడు ప్రతిమాటని ఒత్తి పలుకుతూ.

"అవును. మీ ఇంటికి రావడం ఇష్టంలేదు."

"దేనికి?"

"సౌదామిని."

"ఏం చేసింది నిన్ను?"

"ఏం చెయ్యలేదనుకో."

"నీ మనసులోని మాట సూటిగా సెలవిస్తే సంతోషిస్తాను."

"మరో ఆరు నెలల దాకా రాను."

"వెలి వేస్తున్నావా?"

నవ్వాడు శ్రీకంఠం.

"నేనేకాదు, మరే మగాడు కూడా మీ ఇంటికి రావడం మంచిది కాదు. కనీసం ఓ ఆరునెలలదాకా. నాకు నాయుడు చెప్పిన మాటలు గుర్తున్నాయి. శీలం అన్నది స్త్రీకి అవసరమని సౌదామిని గుర్తించేదాకా రాదలచుకోలేదు."

"వెల్. వెల్! సంతోషించాను బ్రదర్, చాలా సంతోషించాను. థాంక్స్ నీ సలహాకి." ఈసడింపుగా అని తన సీట్ వైపు నడిచాడు పరాంకుశం.

ఓ ముఖ్యమయిన ఉత్తరం టైప్ చేసి మేనేజర్ గదిలోకి తీసుకు వెళ్ళినప్పుడు చెప్పాడు పరాంకుశం, తనకి త్వరలో ఒక పదిహేను రోజుల సెలవు కావాలని, పెళ్ళి చేసుకోబోతున్నానని.

సెలవు తప్పకుండా ఇస్తానని చెప్పి, పెళ్ళికూతురు గురించి అడిగాడు మేనేజర్.

"ఇప్పుడే చెప్పను సర్. సర్‌ప్రయిజ్ న్యూస్." చెప్పాడు పరాంకుశం నవ్వి.

శ్రీకంఠం పరాంకుశం దగ్గరికి వచ్చి సిగరెట్ ఆఫర్ చేసి అడిగాడు.

"నిష్కర్షగా చెప్పినందుకు కోపం వచ్చిందా?"

"రాదా మరి?"

"ఆలోచించు. అర్ధం చేసుకో."

"నువ్వు మా ఇంటికి వచ్చినంత మాత్రాన నాకు ఏ ఇబ్బందీ కలగదు. కాని, సౌదామినికి కాని. నీకు కాని ఇబ్బంది కలుగుతుందనుకుంటే రావటం మానేయి."

శ్రీకంఠం జవాబు చెప్పలేదు.

"సాయంత్రం డాక్టర్ దగ్గరకి తీసుకువెళుతున్నాను. నువు కూడా వస్తావా, అదీ రావా?"

"సారీ. సాయంత్రం నిజంగా ఓ ముఖ్యమైన పని ఉంది, లేకపోతే వచ్చేవాణ్ణి."

"ఆల్ రైట్. తమరి దయ, నా ప్రాప్తం."

ఆఫీసులో పని చేస్తున్నాడన్నమాటే కాని, పరాంకుశం మనసంతా ఇంటిమీదా, సౌదామిని మీదా, అక్కయ్య మీదా ఉంది. సౌదామిని అక్కయ్య మాట వింటోందో, లేదో? ఏడిపిస్తుందేమో? విసుగు పుట్టిస్తే అక్కయ్య వెళ్ళిపోవచ్చు. అప్పుడు తనకి మరీ ఇబ్బంది అవుతుంది. మరెవరైనా అయితే అక్కయ్యలాగా శ్రద్ధగా అన్ని విషయాలు చూసుకోలేరు. ఇంట్లో ఇంకో మనిషి ఉండటం అవసరం. సౌదామినికే వెళ్ళిపోవాలని అనిపిస్తే మరీ ఇబ్బంది. అతని మనసు పని మీద నిలవలేదు.

ఏమైనా సరే, సౌదామిని తన అక్కయ్యకి గౌరవం ఇచ్చేలా చూడాలి అనుకున్నాడు పరాంకుశం.

ఆఫీస్ నుంచి రిజిస్ట్రార్ ఆఫ్ మారేజెస్ ఆఫీస్‌కి ఫోన్ చేసి పెళ్ళి రిజిస్ట్రేషన్ గురించిన కొన్ని వివరాలు అడిగి కనుక్కున్నాడు. తరువాత నాయుడు ఇచ్చిన నంబర్‌కి డాక్టర్‌కి ఫోన్ చేసి సాయంత్రం అపాయింట్‌మెంట్ తీసుకున్నాడు. అప్పటికే నాయుడు కూడా డాక్టర్ సౌదామిని గురించి చెప్పాడు.

✷✷✷

పరాంకుశం ఇంటికి రాగానే, మధ్య హాల్లో కూర్చుని పేకాట ఆడుతున్న అక్కయ్యనీ, సౌదామినిని చూసాడు.

సౌదామిని కూర్చున్న తీరునీ, సౌదామిని పెదవుల మధ్య వెలుగుతున్న సిగరెట్‌ని గుచ్చి గుచ్చి చూస్తూ గుమ్మం దగ్గరే అలాగే నిలబడిపోయాడు పరాంకుశం.

పరాంకుశాన్ని చూసి అతని కళ్ళు తన మీదే కేంద్రీకరించబడి ఉండటం గమనించి చిన్నగా నవ్వి, చెయ్యి ఊపింది సౌదామిని.

"కొత్త బట్టలు వేసుకున్నాను. బాగున్నాయా?" అడిగింది.

పరాంకుశం దగ్గరికి వెళ్ళాడు. చటుక్కున ఆమె నోట్లో వెలుగుతున్న సిగరెట్ లాగేసాడు,

చిరాగ్గా చూసింది సౌదామిని.

"నే తాగితే నీకేమయింది?" అడిగింది కోపంగా. "సిగరెట్లు ఎక్కడివి సౌదామినికి?" అడిగాడు పరాంకుశం అక్కయ్యని.

"గొడవ చేసి కొనుక్కుంది."

"ఇంకెప్పుడూ కొనిపెట్టకు."

"మరి నువ్వు తాగవా ఏం?"

చెప్పింది సౌదామిని కాళ్ళు విలాసంగా ఊపుతూ.

"నేను తాగకపోతే నువ్వూ తాగవా?"

"నువ్వు మానగలవా?"

"నేను మానితే నువ్వు మానేస్తా?"

"ఆ."

"సరే, ఇవాళ్టి నుంచి నేను మానేస్తాను."

"చూస్తాగా ఎన్ని రోజులు నువ్వు మానగలవో."

సౌదామిని కుర్చీలో కూర్చున్న తీరు నచ్చలేదు పరాంకుశానికి.

"కుర్చీలో కూర్చునే పద్ధతి అలా కాదు. అక్కయ్య చూడు ఎలా కూర్చుందో, నువ్వూ అలా కూర్చోవాలి."

"ముదినాపసానిలా అలా కూర్చోవడం చేతకాదు."

ఎదురు సమాధానాలు పరాంకుశానికి ఎప్పుడూ కోపం తెప్పిస్తాయి. ముఖ్యంగా ఆడవాళ్ళ విషయంలో, వచ్చే కోపాన్ని కంట్రోల్ చేసుకుని చెప్పాడు.

"మరోసారి అక్కయ్యని ఏమైనా అంటే ఊరుకోను. లెంపలు వేసుకో."

పరాంకుశానికి కోపం వచ్చిందని గ్రహించి మూడుసార్లు లెంపలు వేసుకుంది సౌదామిని...

"బాగుంది చీర." చెప్పాడు సౌదామిని కుర్చీలో సరిగ్గా సర్దుకు కూర్చున్నాక.

సౌదామిని పేక ముక్కలవంక చూసుకుంటూ ఉండిపోయింది.

"అయిదు నిమిషాల్లో బైటికెళదాం." సౌదామినితో చెప్పాడు పరాంకుశం.

"ఎక్కడికి? సినిమాకా?" అడిగింది సౌదామిని.

"కాదు. డాక్టర్ దగ్గరికి."

"నాకు జ్వరం లేదుగా."

సమాధానం చెప్పకుండా టవల్ అందుకుని బాత్‌రూంలోకి వెళ్ళాడు పరాంకుశం. వెళుతూ బల్లమీద ఉన్న కొత్త పుస్తకం వంక చూశాడు.

రామాయణం!

అరగంట తరువాత సౌదామిని, పరాంకుశం ఇద్దరూ డాక్టర్ ముందు ఉన్నారు. ఆయన సుఖ వ్యాధుల చికిత్సలో స్పెషలిస్ట్.

పరాంకుశం అందించిన లెటర్ చదివాడు డాక్టర్. మధ్య మధ్యలో ఇద్దరిని చూసి, మోరల్ హైజీన్ అసోసియేషన్‌లో పనిచేసే నాయుడు రాసిచ్చిన రికమెండేషన్ లెటర్. దాన్ని సగం చదివి పక్కన పెట్టి చెప్పాడు.

"వెరీ గ్లాడ్ నాయుడు నాతో మీ గురించి ఫోన్‌లో మాట్లాడారు."

బెల్ నొక్కాడు. ఓ యువతి రాగానే చెప్పాడు.

"ఈమెని పరీక్షించాలి. బ్లడ్, యూరిన్ తీసుకో. మీరు ఆ గదిలోకి వెళ్ళండి."

సౌదామిని నర్స్‌తో పక్క గదిలోకి వెళ్ళగానే అడిగాడు డాక్టర్

"మీకీ ఐడియా ఎందుకు కలిగింది?"

"మీ దగ్గరకు రావాలనా? నాయుడు చెప్పారు.."

"సౌదామిని లాంటి స్త్రీని పెళ్ళి చేసుకోవాలనే ఐడియా."

"నాకిది చిన్నప్పటి నుంచీ ఉంది. ఎప్పుడు కలిగిందో ఎలా కలిగిందో సరిగా చెప్పలేను. బహుశా చిన్నప్పుడు నేను చదువుకునే స్కూల్ పక్కనే ఉన్న ఓ వేశ్యా గృహంలోని పద్దెనిమిదేళ్ళ స్త్రీ పడ్డ బాధలు చూసి కావచ్చు. ఓ పాతికేళ్ళ యువతి సుఖవ్యాధులతో చచ్చిపోవడం చూసి కావచ్చు. ఓ మోటు రసికుడు తన మాట వినలేదని పదహారేళ్ళ పిల్లని చావబాది పెట్టిన హింసలు చూసి కావచ్చు. వద్దని చేతులెత్తి దణ్ణం పెడుతూ ఏడుస్తుంటే బలవంతంగా ఖైదు చేసి ఉంచి, వృత్తిలోకి దింపబడ్డ అబలలను చూసి కావచ్చు. కాని, నాకు పదిహేడేళ్ళకే ఈ ఐడియా బాగా స్థిరపడిపోయింది."

"సౌదామిని లాంటి స్త్రీని ఎందుకు ఎన్నుకున్నారు?"

"అంటే?"

"బాంబేలో చెంబూర్‌లో పునరావాస శిబిరమో ఈ వృత్తి చెయడం ఇష్టంలేని అమ్మాయిలు చాలామంది ఉన్నారు. దాని పేరు శ్రద్ధానంద్ ఆశ్రమం. వాళ్ళకి రాస్తే మీ పేరు నమోదు చేసుకుని, ఈ వృత్తి చెయ్యడానికి ఇష్టం లేనివాళ్ళని పరిణయం చేసుకునే అవకాశం కలిగిస్తారు. బహుశా మీకు ఇలాంటి రిహాబిలిటేషన్ సెంటర్స్ గురించి తెలియదనుకుంటాను."

"తెలుసు. సౌదామినికి వచ్చిన లోటు ఏమిటి?"

"షి యీజ్ ఏ రా కాల్ గర్ల్. మార్చటం చాలా కష్టం. ఇల్లాలిగా జీవించాలని ఆత్రపడే మీలాంటి సాహసవంతుల కోసం ఎదురు చూసే వాళ్ళు చాలామంది ఉన్నారు."

"అలాంటి వాళ్ళని చేసుకోవడానికి చాలామంది ముందుకు వస్తారు కాని, సౌదామినిలాంటివాళ్ళ సంగతి ఎవరూ పట్టించుకోరు. సౌదామినిని దారికి తీసుకురావడానికి నేను చాలా కష్టపడాల్సి ఉంది అని నాకు తెలుసు. అసలు వస్తుందో రాదో కూడా అనుమానమే. సౌదామిని మనసా, వాచా, కర్మణా నిజమయిన వేశ్య. కానీ మీరు చెప్పిన వాళ్ళు మనసా వేశ్య కాదు. తప్పు గ్రహించి సరిదిద్దుకోవాలని అనుకునేవాళ్ళు."

సౌదామిని పక్కగదిలోంచి వచ్చి పరాంకుశం పక్కన కూర్చుంది.

"రేపు సాయంత్రానికి రిపోర్టులు రెడీ అవుతాయి. ఫోన్ చేస్తే మిగతా విషయాలు మాట్లాడుకుందాం." చెప్పాడు డాక్టర్.

"థాంక్స్ ఎలాట్, డాక్టర్ మీ ఫీజు?"

అది చెల్లించి, పరాంకుశం డాక్టర్‌తో కరచాలనం చేసి సౌదామినితో పాటు బయటికి నడిచాడు.

"ఇక్కడికని చెప్పలేదే? నన్నడిగితే నేను చెప్పనా? నాకు రోగం ఉంది" చెప్పింది సౌదామిని.

మౌనంగా ఉండిపోయాడు పరాంకుశం.

పరాంకుశం ఇంటికి వెళ్ళగానే పరాంకుశం మామయ్య ఎదురు చూస్తున్నాడు. సౌదామిని వంక తేరిపార చూసి అడిగాడు.

"ఈ అమ్మాయేనా?"

"అవును మామయ్యా. ఎప్పుడు వచ్చారు?"

"నీ ఉత్తరం అందింది. ఈ అడ్రసు కనుక్కుని సరాసరి వచ్చేసాను."

"అన్ని విషయాలు నెమ్మదిగా మాట్లాడుకుందాం. మీరు ఇప్పటికిప్పుడే వెళ్ళిపోవటం లేదుగా. అత్తయ్యని తీసుకురాలేదా? అంతా కులాసానా?"

"ఒకటే కులాసా."

"ఈయన మా మామయ్య. ఈయన దగ్గరే పెరిగాను." పరిచయం చేశాడు సౌదామినికి.

"నమస్కారం చెయ్యాలి పెద్దవాళ్ళకి."

పరాంకుశం అక్కయ్య చెవిలో చెప్పింది సౌదామినికి.

"నమస్కారం." చెప్పింది సౌదామిని సాగదీస్తూ.

"పెళ్ళి అయిపోయిందా?" అడిగాడు పరాంకుశం మామయ్య.

"మీకు తెలియజెయ్యకుండా, మీ ఆశీర్వాదం లేకుండా ఎలా అవుతుందనుకున్నారు?" అడిగింది పరాంకుశం అక్కయ్య.

సౌదామిని తన గదిలోకి వెళ్ళిపోయింది.

"ఎక్కడికో వెళ్ళొస్తున్నట్లున్నారే?" అడిగాడు కళ్ళజోడులోంచి చూస్తూ.

"డాక్టర్ దగ్గరికి." చెప్పాడు పరాంకుశం.

"అలా కూర్చో. మాట్లాడాలి నీతో."

మామయ్య ఎదురుగా పరాంకుశం కూర్చున్నాడు.

"కొత్తింటి అడ్రసు ఎలా తెలుసు?"

"మీ బావగారు, శ్రీకంఠాలు లేరు, నువ్వు చెప్పకపోయినా చెప్పడానికి?" నిష్టూరంగా చెప్పాడాయన.

కాసేపాగి అడిగాడు.

"నీకు కాని పిచ్చి ఎక్కలేదుగా."

"కొద్దిగా ఎక్కిందనే అందరి నమ్మకం." నవ్వాడు.

"లేకపోతే ఏమిటోయ్? చూస్తూ చూస్తూ ఇలాంటి ఫ్లాట్‌ఫారమ్ వ్యభిచారినా చేసుకునేది? నువ్వు తెలివి తక్కువగా చేసుకుంటానంటే మాత్రం నేను చూస్తూ ఊరుకుంటానని అనుకుంటున్నావా? నిక్షేపంలాంటి సంబంధాలు ఎన్ని లేవూ? అసలు ఈ పిచ్చి ఏ వెధవలు ఎక్కించారు నీకు? చెట్టంత మామయ్య ఉన్నాడన్న సంగతి మరిచిపోయి, నాతో సంప్రదించకుండానే దాన్ని ఇంట్లోకి తెచ్చి ఉంచుకుంటావా? ఛీ. ఛీ. వయసు వచ్చింది ఎందుకు?"

కండువా తీసి దులిపి మళ్ళీ భుజం మీద వేసుకున్నాడు. పరాంకుశం మామయ్య.

"నీకు కాదు, మాకు అప్రతిష్ఠ, ఇలాంటి దాన్ని చేసుకున్నావని అందరికీ తెలిస్తే నన్ను చీమని చూసినట్లు చూస్తారు. చెడ్డ పని చేస్తూంటే అడ్డు పడక్కర్లేదా అని, తల్లి తండ్రులు లేని పిల్లాడ్ని అన్యాయం చేసామని మమ్మల్ని అంటారు. నా గొంతులో ప్రాణముండగా ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదు." కోపంతో ఎగిరిపడ్డాడు ఆయన.

"ఇంకా ఏమయినా అనదల్చుకుంటే అనేసేయి. నీకోపం తగ్గిన తర్వాత నేను చెప్పదలచుకుంది చెపుతాను."

"ఏమిటోయ్ నువ్వు చెప్పదలచుకుంది?"

"నేను ఆ అమ్మాయిని కావాలని కోరి చేసుకుంటున్నాను. దీనివల్ల మీకేమయినా అప్రతిష్ఠ వస్తే అది నా తప్పు కాదు. అది లోకుల తప్పు. చేసుకునేది మీరు కాదుగా. ఈ పెళ్ళి ఎలా జరుగుతుందో చూస్తానన్నారు. ఎలా జరుగుతుందో చూసి నాలుగు అక్షింతలు వేయండి."

"అమ్మాయ్! పెద్దతరం, చిన్నతరం లేకుండా ఎన్ని కూస్తున్నాడో వింటున్నావుగా? అయినా, నీ బుద్ధి ఏమైంది? నాపసానిలా వచ్చి సహాయం చేస్తున్నావా, సహాయం." మేనకోడలి వైపు తిరిగి కోపంగా అరిచాడు ఆయన.

"మీరు పెద్దవారు, ఇలాంటివి మీరు భరించలేరు. ఎప్పటినుంచో ఇది వద్దని అంతా చెపుతూనే ఉన్నాం. వాడిది గట్టి పట్టుదల అని అర్థమైంది, వాడి ఖర్మం అనుకుని వదిలేస్తే ఇద్దరికీ హాయి కదా మామయ్యా." చెప్పింది పరాంకుశం అక్కయ్య.

"ఛీ. ఛీ. నా గుండె మండిపోతోంది."

"కాస్త వేడి కాఫీ ఇవ్వు మామయ్యకి." లేచి గదిలోకి వెళ్ళిపోయాడు పరాంకుశం.

"కాఫీ తెస్తానుండు మామయ్యా" చెప్పింది పరాంకుశం అక్కయ్య, వంటగదిలోకి వెళుతూ.

"కాఫీ వద్దు. మట్టిగడ్డా వద్దు. వాడితో ఏ సంగతీ తేల్చుకుని గాని కదలను."

పరాంకుశం మామయ్య లేచి పరాంకుశం గదిలోకి వెళ్ళాడు.

"ఏం చూసిరా ఆ అమ్మాయిని ఉంచుకున్నావు? ఉంచుకోవటానికి ఇంత ఆర్భాటం దేనికీ, అందరినీ పిలిచి?"

"ఉంచుకోవడం కాదు మామయ్య. పెళ్ళి చేసుకోవడం."

"పెళ్ళి అనే పేరు పెట్టినంత మాత్రాన అది పెళ్ళి అయిపోతుందా, వెర్రినాగన్నా? ఉంచుకోవడమే అవుతుంది."

"మీరెలాగైనా అనుకోండి."

"కాస్త తార్కిక జ్ఞానంతో ఆలోచించు రేపు మీ ఇద్దరికీ పుట్టిన పిల్లల సంగతి ఏమవుతుంది? వాళ్ళని ఎవరు పెళ్ళి చేసుకుంటారు? ఇలాంటి సంగతులు ఆలోచించావా ఎప్పుడయినా? దీని బుద్ధి తిరిగి మధ్యలో లేచిపోతే, అది విడాకులిచ్చేదాకా నీకు మళ్ళీ పెళ్ళి చేసుకునే అర్హత ఉండదు. చచ్చేదాకా అలా ఒంటరిగా కుములుతూ చావాలి. అంతేకాదు, అప్పుడు దాని దగ్గరకు వెళ్ళేవారందరూ, 'పరాంకుశంగాడి పెళ్ళాం దగ్గరికి' అని చెప్పుకుంటారు."

"ఇవన్నీ ఆలోచించాను. అలా జరగడానికి అవకాశాలున్నాయి, అలా జరగకుండా ఉండటానికీ అవకాశాలున్నాయి. నా ప్రయత్నం నన్ను చేయనీ"

"పగ్గాలు నీ చేతిలో ఉన్నాయనుకోకు. ఓసారి గుర్రం మీద నుంచి కిందపడ్డాక లేవలేవు."

"కావచ్చు, కాకపోవచ్చు. కాలమే నిర్ణయిస్తుంది."

"నువ్వు చేసే ఈ ప్రయత్నం ఎడారిలో మిట్టమధ్యాహ్నం బిందెలకొద్దీ నీళ్ళు పోసి, ఆ నీళ్ళతో తాగడానికి ఉపయోగపడే కొలను చేయటం లాంటిది. ఎన్ని నీళ్ళు పోసినా ఇసుకలో ఇంకిపోతాయి."

"నా మనసు ఇంక మార్చలేవు మామయ్యా! ఈ ఒక్క విషయంలో నన్ను క్షమించి."

"ఈ ఒక్క విషయంలో చిన్నవాడివయినా నువ్వే నన్ను క్షమించి నేను చెప్పిన చెప్పిన కొవ్వూరు సంబంధం ఒప్పుకో."

"అసంభవం."

"అంతేనా?"

"అంతే మామయ్యా."

"ఒరేయ్ దౌర్భాగ్యుడా, అనుభవిస్తావురా. నెత్తీ నోరూ కొట్టుకుని చెపుతున్నా వినకపోతే చివరికి నువ్వే అనుభవిస్తావు. చూస్తూండు కావాలంటే. నీ జీవితాన్ని చేజేతులానాశనం చేసుకుంటున్నావు."

పరాంకుశం పెదవి విప్పలేదు.

"మీ అమ్మా, నాన్నా బ్రతికుంటే ఇలా చేయగలిగేవాడివా? చచ్చి ఏలోకాన ఉన్నారో గానీ, వాళ్ళు నిన్ను నా చేతుల్లో పెట్టారు. వాళ్ళ ఆత్మ ఘోషించదు?"

"ఇదుగో మామయ్యా, కాఫీ."

"మీ ఇంట్లో ఇంక పచ్చి మంచినీళ్ళయినా ముట్టుకోను."

పరాంకుశం అక్కయ్య ఇచ్చిన కాఫీ గ్లాసు ఆ ముసలాయన నేలమీద విసిరికొట్టాడు.

"ఊరుకో మామయ్యా నువ్వు కూడా మరీ ఏమిటలా చిన్నపిల్లాడిలా." సముదాయించబోయింది పరాంకుశం అక్కయ్య.

"అసలు ఇంక ఒక్క క్షణం కూడా ఇక్కడ ఉండను. మీ ఇంట్లో మళ్ళీ కాలుపెడితే ఒట్టు."

అక్క, తమ్ముడు ఇద్దరూ మాట్లాడలేదు.

"ఎనిమిది వేలు కట్నం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు ఆ కొవ్వూరు సంబంధం వాళ్ళు. అయినా, నాదే తప్పులే."

బ్రతిమాలుతున్నా వినకుండా, ముసలాయన నిప్పులు కక్కుతూ విసవిసా చేతి సంచితో వెళ్ళిపోయాడు.

"ఆయనకి బాగా కోపం వచ్చింది, ప్చ్." చెప్పాడు పరాంకుశం.

"ఇంక రాడనుకుంటాను మనింటికి." చెప్పింది పరాంకుశం అక్కయ్య విచారంగా.

"ఆ సంగతి ఎప్పుడో నాకు తెలుసు. ఈ పెళ్ళి జరగడం వల్ల నాకు కావలసిన వాళ్ళంతా దూరం అవుతారు. చేయూత నిచ్చేది బావలాంటి వాళ్ళు కొద్దిమంది మాత్రమే. నాకు బాధేమీ లేదు. ఇదేం అనుకోనిది కాదుగా? అత్తయ్య ఏమంటుందో చూద్దాం. త్వరలో ఉత్తరం వస్తుంది."

పరాంకుశం తన గదిలోకి వెళ్ళిపోయాడు. పరాంకుశం అక్కయ్య హాల్లో కుర్చీలో కూర్చుంది.

అంతదాకా తన గదిలో గుమ్మం దగ్గరే నిలబడి ఆసక్తిగా, దొంగతనంగా వాళ్ళ సంభాషణ వింటున్న సౌదామిని తన చెవులని తనే నమ్మలేకపోయింది. తను విన్నదంతా నిజమా? లేక తనని నమ్మించడానికి పరాంకుశం ఆడుతున్న నాటకమా అని కొద్దిసేపు ఆలోచించింది.

ఇతనికో మామయ్య ఉన్నాడా? పెళ్ళి చేద్దామని అనుకుంటున్నాడా? ఓ మంచి సంబంధాన్ని నిశ్చయం చేసాడా పరాంకుశం కోసం?

మరి అంతా తెలిసి తనని ఎందుకు తెచ్చుకున్నట్లు? అందులో ఎనిమిదివేల రూపాయలు! ఒకటి కాదు రెండు కాదు, ఎనిమిదివేల రూపాయల కట్నం వదులుకుని తనని పెళ్ళి చేసుకోబోతున్నాడా? ఎందుకు? అంత డబ్బు వదిలి తననే ఎందుకు పెళ్ళి చేసుకుంటున్నట్లు?

పరాంకుశం మామయ్య చెప్పినట్లు పిచ్చి కాకపోతే మరేమిటి? తనకోసం ఇంకా ఎదురు ఖర్చు పెడుతున్నాడు కూడా.

ఎలాగయినా సరే, పరాంకుశాన్ని సుఖపెట్టాలి. తనని ఎప్పటికీ ఉంచుకుంటాడు. మధ్యలో వదిలేయడు. కనీసం ఒక సంవత్సరం అయినా ఉంచుకుంటాడు. తను మంచిగా ఉంటే ఇంకా ఎక్కువ కాలం, తను చచ్చిపోయేదాకా ఉంచుకోవచ్చు.

అప్పటిదాకా పెళ్ళి, పరాంకుశం అంతా ఓ ఆటగా, చాలా తేలికగా తీసుకుంది సౌదామిని. ఒకటి రెండు రోజులు చూసి వెనక్కి వెళ్ళి పోదామనుకుంది. వెంటనే వెళితే పోలీసు ఇన్స్పెక్టర్ ఏమైనా అంటాడన్న భయంతో ఇంట్లోంచి వెళ్ళలేదు. పరాంకుశంలోని సిన్సియారిటీ, తాపత్రయం అర్థం కాలేదు సౌదామినికి. ఇప్పుడు సంగతి తెలిసాక, తనంటే పరాంకుశం ఇష్టపడుతున్నాడనీ, తనకి విలువ ఇస్తున్నాడనీ సౌదామినికి నమ్మకం కలిగింది.

ఆ నమ్మకం ఆమెకి చెప్పలేని ఆనందాన్నిచ్చింది. ఇదివరకెప్పుడూ అలాంటి ఆనందం, నిశ్చింత ఆమెకి కలగలేదు.

✷✷✷

*(తరువాయి భాగం వచ్చే సంచికలో)*

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..




**Click here to go to KOUMUDI Library**